
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.1 : కనిష్ఠం 20.6
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
బుధవారం 10 జూలై 2024



రేపు దేవాలయ భూమి బహిరంగ వేలం

మద్నూర్, జూలై 9: మద్నూర్ మండలంలోని ప్రధాన గ్రామ శివారులో గల హనుమాన్ దేవాలయ భూమిని గురువారం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు సలాబాత్‌పూర్ ఆంజనేయస్వామి ఆలయ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. దేవాలయానికి సంబంధించిన సర్వే నెం. 148/1, ఎకరాకు 7-08, సర్వే నెంబర్ 148/2, ఎకరాలు 7-08, మొత్తం 14 ఎకరాల 16 గుంటల భూమిని మేనూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో బహిరంగ వేలం పాట వేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

వన మహోత్సవ లక్ష్యం 26.40 లక్షలు



కామారెడ్డి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వానాకాలంలో నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమం కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఏటా లక్షల్లో మొక్కలు నాటి పెంచుతున్నారు. ఈ సారి కూడా జిల్లాలో 26.40 లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నాటేందుకు కార్యాచరణను రూపొందించారు. వర్షాలు పడితే ఇప్పటికే కార్యక్రమం మొదలయ్యేది. కానీ భారీ వర్షాలు కురువక మొక్కలు నాటడం ఆలస్యం అవుతోంది. ఈ వారం నుంచే కార్యక్రమాన్ని ఉధృతం చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే వన మహోత్సవం కార్యక్రమం నిర్వహణపై కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖాలధికారులతో సమీక్షించారు. గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖల ఆధ్వర్యంలో మొక్కలను నాటించనున్నారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, 526 గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటేందుకు ఖాళీ స్థలాలను గుర్తించనున్నారు.

హరితహారానికి బదులు వన మహోత్సవం

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మొదటిసారిగా వన మహోత్సవం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 8 విడతలుగా ప్రతీఏటా వానాకాలం ప్రారంభంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇప్పుడు హరితహారం పేరును వన మహోత్సవంగా కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి 9వ విడతలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనుంది. జిల్లాలో ఈ ఏడాది మొక్కలు నాటే కార్యక్రమానికి అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈ వారంలోనే జిల్లాలో వన మహోత్సవం కింద మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయగా వర్షాలు సరిగ్గా కురియక మొక్కలు నాటడం ఆలస్యం అయింది. ప్రతీ పంచాయతీలో నిర్వహిస్తున్న నర్సరీల్లో నాటేందుకు మొక్కలు సిద్ధం చేశారు. వన మహోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు సమీక్షలు కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలో గత ఏడాది నాటకుండా నర్సరీల్లో మిగిలిపోయిన మొక్కలను కూడా ఈసారి నాటించాలని అనుకుంటున్నారు. మొక్కలు నాటే స్థలాలను గుర్తించాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

26.40 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

వన మహోత్సవంలో భాగంగా ఈ యేడు జిల్లాలో 26.40 లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు అధికారులు నాటించేందుకు మొక్కలను సిద్ధం చేశారు. జిల్లాలోని 25 మండలాల్లోని 526 గ్రామ పంచాయతీలు, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో వన మహోత్సవం కింద 26 లక్షల మొక్కలను నాటనున్నారు. ఇందుకు అవసరమైన ప్రదేశాలను ఎంపిక చేస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు మొక్కలు నాటేందుకు లక్ష్యాన్ని కేటాయించారు. ప్రధానంగా అటవీ, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 4 లక్షల మొక్కలు, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 16 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మండలానికి ఒక అధికారి చొప్పున బాధ్యతలు అప్పగించనున్నారు. గ్రామాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను అటవీశాఖ, ఆలయాలు, పోరంబోగు భూముల్లో, గ్రామీణ, ఇతర ప్రధాన రహదారులకు ఇరువైపుల మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించారు. గత ఏడాది కంటే ఈసారి ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటాలని అధికారులు భావిస్తున్నారు.

మొక్కలు నాటేందుకు స్థలాల గుర్తింపు

జిల్లా అటవీ, గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో 26 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 4 లక్షలు అటవీశాఖ, 16 లక్షలు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద తదితర అటవీరేంజ్‌ల పరిధిలో మొక్కలను నాటించి పెంచాలని నిర్ణయించారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో నర్సరీలను పెట్టి మొక్కలు పెంచుతున్నారు. ఈ మొక్కలను నాటించేందుకు జిల్లాలోని అటవీ రేంజ్ రెంజర్లు, సెక్షన్, బీట్ అధికారులు కలిసి స్థలాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే నర్సరీల నుంచి గ్రామాలకు చేరవేసేందుకు మొక్కలను సిద్ధంగా ఉంచారు. అలాగే గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డీఆర్‌డీవో, ఏపీడీవో ఆధ్వర్యంలో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లను రంగంలోకి దింపారు. గ్రామాల్లో అనువైన స్థలాల్లో మొక్కలు నాటించే పనిలో ఇప్పటి నుంచే నిమగ్నమయ్యారు.

- జిల్లాలో 26.40 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- 526 గ్రామ పంచాయతీల్లో, అటవీశాఖ పరిధిలో కొనసాగుతున్న నర్సరీలు
- డీఆర్‌డీఏ, అటవీ శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమ నిర్వహణ
- వానలు పడడమే తరువాయి
- మొక్కలు నాటేందుకు కార్యాచరణ
- ఖాళీ స్థలాల గుర్తింపునకు ముమ్మరం చేసిన అధికారులు

అటవీశాఖకు 4 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

● నిఖిత, జిల్లా అటవీశాఖాధికారి

ఈ ఏడాది అటవీశాఖ ఆధ్వర్యంలో 4 లక్షల మొక్కలను నాటేందుకు లక్ష్యాన్ని కేటాయించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ మొక్కలను శాఖ ఆధ్వర్యంలో నాటనున్నాం. ఇప్పటికే అటవీశాఖ ఆధ్వర్యంలో అంతంపల్లి, ఘన్‌పూర్, కన్నాపూర్, గాంధారి, బాన్సువాడ, జుక్కల్, సదాశివనగర్ తదితర అటవీ ప్రాంతాల్లో నర్సరీలను సిద్ధం చేసి అటవీ ప్రాంతాల్లో నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. శాఖలోని అధికారులను సిబ్బంది సైతం వన మహోత్సవంలో మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యారు.





గాంధారి, రాజంపేట మండలాల నర్సరీల్లో మొక్కలు పెంచుతున్న సిబ్బంది

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

కామారెడ్డి టౌన్, జూలై 9: వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. వర్షాలు ఒకింత ఆలస్యమైనప్పటికీ ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్నందున పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు ఇది ఎంతో అనుకూలమైన సమయమని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అనువైన స్థలాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 20కోట్లకు పైగా మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని, జిల్లాల వారీగా కేటాయించిన లక్ష్యాలను సాధించాలని అన్నారు. నాటిన ప్రతీ మొక్కకు జియో ట్యాగింగ్ చేయించాలని, ఆగస్టు నెలాఖరు నాటికి నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా నూటికి నూరు శాతం మొక్కలు నాటేలా పకడ్బందీ కార్యాచరణ అమలు చేయాలన్నారు. ముఖ్యంగా అటవీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలు వన మహోత్సవం విజయవంతంతో క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. గ్రామాలను దత్తత తీసుకుని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా వివిధ వర్గాల వారిలో స్ఫూర్తిని పెంపొందించాలని కలెక్టర్లకు సూచించారు. పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, అవెన్యూ ప్లాంటేషన్, సంపద వనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎక్కడైన లోపాలు ఉంటే సరిదిద్దాలని అన్నారు. నర్సరీలలో అందుబాటులో ఉన్న మొక్కలను అవసరమైన ప్రదేశాలకు చేరవేస్తు, మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. మహిళ సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళ శక్తి కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో విజయవంతంగా అమలు చేస్తూ ప్రభుత్వ లక్ష్యం సిద్ధించేలా అంకిత భావంతో కృషి చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని, మొక్కలను నాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. మహిళ శక్తి ప్రోగ్రాం పగడ్బందీగా నిర్వహించాలని, ఎరువులు విత్తనాల కొరత రాకుండా చూడాలని, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తుగా పారిశుధ్య కార్యక్రమాలు గ్రామాలు, పట్టణాల్లో చేపట్టాలని, ఫ్రైడే డ్రైడేగా నిర్వహించాలని, పెండింగ్ ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, వచ్చే వారం జిల్లాలో కేంద్ర జలశక్తి సంఘం అధికారుల పర్యటనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో నిఖిత, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలసదనం చిన్నారులతో సంతోషాలను పంచుకోవాలి : కలెక్టర్

బాలసదనం చిన్నారులతో తమ సంతోషాలను జరుపుకొని వారికి ఆనందాన్ని అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దాతలకు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలసదనంను పరిశీలించారు. బాలసదనంలోని గదులను, ఆవరణను పరిశీలించారు. బాలికలతో మాట్లాడి వారికి కల్పించిన వసతులు ఇస్తున్న ఆహారం, చదువుకోవడానికి కల్పించిన అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో అపరిశుభ్రత వాతావరణంతో వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున పరిసరాలను ఎప్పుడు శుభ్రం చేస్తూ బాలసదనం మొత్తం క్లీన్‌గా ఉంచాలని అన్నారు. విద్యుత్ సమస్య లేకుండా చూడాలని అన్ని ఫ్యానులు పని చేసేలా రిపేర్ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల, ఉద్యోగుల అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి చాలా రోజుల నుంచి విధులకు హాజరుకాని అవుట్ సోర్సింగ్ అటెండర్ హేమలతను విధుల నుంచి తొలగించాలని, నిరంతరం సీసీ కెమెరాలు పని చేయాలని, బాలసదనం సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని, నైట్ వాచ్‌మెన్ ఖచ్చితంగా సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు బాలసదనంలోనే ఉండాలని తెలిపారు. నిర్దేశించిన మెనూ ప్రకారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం ఫ్రెష్‌గా అందించాలని బాలసదనం సూపరిటెండెంట్ సంగమేశ్వరిని ఆదేశించారు. రీడింగ్ రూమ్‌ను పరిశీలించి చిన్నారులు చదువుకునేందుకు దీన్ని ఖచ్చితంగా ఉపయోగించాలని తెలిపారు.

తీరు మార్చుకోండి

కస్తూర్బా సిబ్బందికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు హెచ్చరిక

నాగిరెడ్డిపేట, జూలై 9: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, వంట సిబ్బంది తమ తీరు మార్చుకోవాలని, తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు వారిని హెచ్చరించారు. కస్తూర్బా పాఠశాలలో ఆదివారం ఉదయం 11 గంటల వరకు అల్పాహారం అందక విద్యార్థినులు అవస్థలు పడ్డ విషయాన్ని తెలుసుకున్న ఆయన మంగళవారం పాఠశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ వీణ పాఠశాలలో లేకపోవడంతో ఆయన సిబ్బందిని ప్రశ్నించగా.. ఆడిట్ విషయమై కామారెడ్డి డీవో ఆఫీస్‌కు వెళ్లినట్లు పాఠశాల ఇన్‌చార్జి అనురాధ ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో పాఠశాలలో ఆదివారం జరిగిన ఘటన గురించి విద్యార్థినులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే ఉదయం 11 గంటల వరకు విద్యార్థినులకు అల్పాహారం అందించని విషయమై పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందిని వంట సిబ్బందిని ఆయన ప్రశ్నించారు. విద్యార్థినులకు ఆలస్యంగా అల్పాహారం అందించడంతో పాటు నాణ్యత లేని భోజనం పెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, మొదటి సారిగా తన దృష్టికి ఈ సమస్య రావడంతో ఈ సారి ఎవరిపైన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, పాఠశాల సిబ్బంది తమ తీరును మార్చుకోవాలని, తిరిగి ఇలాంటి సంఘటనలు పునరావృత్తం అయితే బాధ్యులపైన కఠిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హెచ్చరించారు. అనంతరం ఆయన మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. మోడల్ స్కూల్‌లోని హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించడం లేదని, చాలా మంది విద్యార్థులు తమ ఇళ్ల నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని ప్రిన్సిపాల్ శ్రీలతను ఆదేశించారు. దీంతో పాటు మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకుడు రియాజ్‌తో ఆయన మాట్లాడారు. నాణ్యమైన భోజనం అందించకుంటే ఏజెన్సీని మారుస్తామన్నారు. పాఠశాలలోని ఉపాధ్యాయుల మధ్య విభేదాలున్నట్లు, దీంతో విద్యార్థులకు విద్యా బోధన సరిగ్గా అందడం లేదన్న విషయం పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఉపాధ్యాయులు తీరు మార్చుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి, ఆరీఫ్, షాహెద్ పాషా, కిష్టయ్య, లక్ష్మణ్, ఇమామ్, బాల్‌రెడ్డి, పర్వత్‌రావు, కుమార్, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.



నాగిరెడ్డిపేట కస్తూర్బా పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

పాము కాటుతో పరేషాన్

- పది రోజుల వ్యవధిలో నలుగురు మృతి
- జిల్లాలో లింగంపేట, ఎల్లారెడ్డి, మద్నూర్, నాగిరెడ్డిపేట మండలాల్లో ఘటనలు
- అన్ని మరణాలకు కట్ల పాము కాటే కారణం
- పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో యాంటివినమ్ అందుబాటులో ఉన్నా అవగాహన కరువు
- జీజీహెచ్, ఏరియా ఆసుపత్రులకు వచ్చే సరికి ప్రాణాల మీదకు
- రైతులు, చిన్నారులు, గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా పాముకాటుకు గురవుతున్న వైనం



నాగిరెడ్డిపేటలో మృతి చెందిన వైష్ణవి



లింగంపేటలో మృతి చెందిన మహిళ

కామారెడ్డి టౌన్, జూలై 9: వర్షాకాలంలో ప్రజలు ఒక వైపు సీజనల్ వ్యాధులతో మరోవైపు పాముకాటులతో బెంబేలెత్తిపోతున్నారు. వర్షాకాలం అంటేనే ప్రాణాపాయ కాలమని ప్రభుత్వ యంత్రాంగం, ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ప్రతీ సీజన్‌లో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులు, పాముకాటు బాధితులు ఎక్కువగా ఉంటారనే విషయం తెలిసిందే. అయినప్పటికీ అధికారులు అందుకు సంబంధించిన పలు చర్యలు చేపట్టడంలో, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో అశ్రద్ధ వహిస్తున్నారు. గత రెండు నెలల కాలంలోనే పదుల సంఖ్యలో పాముకాటు బాధితులు ఆయా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందారంటే ఏ స్థాయిలో పాముకాటు బాధితులు పెరుగుతున్నారో అర్థం చేసుకోవచ్చు. పాముకాటుకు గురికాగానే ఆందోళన చెందడంతో పాటు పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు వెళ్లకుండా దూరంగా ఉన్నా సరే కామారెడ్డి గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రికి, ఎల్లారెడ్డి, బాన్సువాడ ఏరియా ఆసుపత్రులకు వస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. గత పది రోజుల వ్యవధిలో ఆయా మండలాల్లో పాము కాటుతో నలుగురు మరణించడంతో పాటు మరొకరు చికిత్స పొందుతుండడంతో జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనెలకొంటుంది.

పది రోజుల వ్యవధిలో నలుగురు పాము కాటుతో మృతి

జిల్లాలోని ఆయా మండలాల్లో పాము కాటు బాధితులు పెరుగు తున్నా గ్రామాల్లో రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించడంలో స్థానిక సంస్థల సిబ్బంది విఫలమవుతున్నారు. గత పది రోజుల వ్యవధిలో జిల్లాలోని ఆయా మండలాల్లో ఐదుగురు పాము కాటుకు గురి కాగా అందులో నలుగురు మృత్యువాత పడ్డారు. కట్లపాము కాటేయడంతోనే నలుగురు మృతి చెందడం గమనార్హం. సోమవారం రాత్రి నాగిరెడ్డిపేట మండలం జప్తి జానకంపల్లి గ్రామంలో శంకరయ్య ఆయన మనవరాలు వైష్ణవిని కట్లపాము కాటు వేసింది. వైష్ణవి మృతి చెందగా శంకరయ్య సిరిసిల్లా జిల్లాలోని ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరాడు. మద్నూర్ మండలంలోని పెద్దఎక్లారా గ్రామానికి చెందిన ఔటి గంగమణి అనే మహిళకు పాముకాటు వేయడంతో నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత బుధవారం మృతి చెందింది. ఎల్లారెడ్డి మండలంలోని బాలాజీనగర్ తండాలో రుడావత్ కమల అనే మహిళను గత మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేయడంతో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కామారెడ్డి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. అదేవిధంగా లింగంపేట మండలంలోని కన్నాపూర్ తండాలో నూనవత్ జనవ్వ అనే మహిళ ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేయడంతో కుటుంబీకులు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. ఇక పాఠశాలల్లో స్కావెంజర్లను తీసేసినప్పటి నుంచి పాఠశాలలు పరిశుభ్రతకు నోచుకోవడం లేదు. ఇదే బాటలో అంగన్‌వాడీ సెంటర్లు, హాస్టల్‌లు సైతం ఉంటున్నాయి. దీంతో ఏపుగా పెరిగిన పొదలతో విద్యార్థులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ పలుచోట్ల విష పురుగులకు, పాము కాటుకు బలి కావాల్సి వస్తోంది. ఇటీవల మైనార్టీ పాఠశాలను కామారెడ్డి చైర్‌పర్సన్ ఇందుప్రియ పరిశీలించగా ఆ పరిసరాల్లోనే ఓ పుట్ట వద్ద పాము తిరుగుతుండడంపై ఆమె సైతం అసహనం వ్యక్తం చేశారు. ఒకవేళ ఆ పాము పిల్లలను కాటువేస్తే వారి పరిస్థితి ఏమిటనే దానిపై ఆందోళన వ్యక్తం చేశారు.

పరిసరాల పరిశుభ్రతపై అశ్రద్ధ

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంపై సిబ్బంది అలసత్వం మెండుగా కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్‌లు, అంగన్‌వాడీ సెంటర్ల పరిసరాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయి. పలు ప్రభుత్వ పాఠశాలల్లో అసలు పరిశుభ్రత పనులు చేపట్టిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. ప్రతీ పాఠశాలలో ఏపుగా పెరిగిన పొదలు పాములకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇవే కాక గ్రామీణ ప్రాంతాల్లో అన్ని చోట్ల పొదలు ఏపుగా ఉండడం అటు ప్రజలు, ఇటు సిబ్బంది వాటిని తొలగించడంపై అశ్రద్ధ వహిస్తుండడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఆ పొదలలో పాములు స్థావరం ఏర్పరుచుకోవడంతో ప్రజలు అటువైపుగా వెళ్లిన సమయంలో కాటుకు గురై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో అందుబాటులో ఉన్న అవగాహన కరువు

పాము విషం శరీరంలోకి వేగంగా చేరడానికి కారణం పాముకాటు బాధితుడు చెందే ఆందోళననేనని, తనకు ఏదో జరుగుతుందనే ఆందోళన చెందడంతో విషం వేగంగా శరీరంలోకి చేరుకుంటుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. పాము కాటు వేసిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాథమిక చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు. పాములలో కట్లపాము, నాగుపాము వంటివి మాత్రమే విషపూరితమైనవని పేర్కొంటున్నారు. ఇటీవల జరిగిన పాముకాటు మృతులకు కారణమైనది సైతం కట్లపాము కావడం గమనార్హం. కట్లపాము కరిచినప్పటికీ విషంతో పాటే నొప్పి కలుగకుండా ఒక రకమైన ఆమ్లాలు విడుదల చేయడం వల్ల ఏ మాత్రం సందేహం కలగదు. కట్లపాము కరిచాక 3 గంటల తర్వాత వాంతులు, జ్వరం, నొప్పులు వస్తాయి. ఆ తర్వాత విషయం శరీరంలోకి మొత్తం పాకి నోట్లోంచి నురుగ కారుతోంది. విషసర్పం కాటుకు నోటి వెంట నురుగు, తల నొప్పి, తల తిరుగుడు, చూపులో రెండు దృశ్యాలు కన్పిస్తాయి. వీటిని ప్రీ పెరాల్టిక్ లక్షణాలుగా విభజిస్తారు. ఈ పాము కాటు లక్షణాలు కనిపిస్తే రోగికి వెంటనే యాంటీవీనమ్ డోస్‌ను ఇవ్వాలి. మొదట 10 వైల్స్ యాంటి వీనమ్, ఆరు గంటల వ్యవధి తర్వాత మరో 10 వైల్స్ డోస్ ఇవ్వాలి. ఆరు గంటల తర్వాత కూడా రోగి ఆరోగ్య పరిస్థితుల్లో మార్పురాకుంటే చివరి 5 నుంచి 10 వెల్స్‌యాంటి వీనమ్ ఇవ్వాలి. ప్రస్తుతం ఈ వైల్స్ అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో అందుబాటులో ఉంటున్న పలుచోట్ల వైద్యులు అందుబాటులో లేకపోవడమో లేదంటే సిబ్బందికి అవగాహన లేకపోవడంతో పాటు ముఖ్యంగా రక్త పరీక్షకు సంబంధించిన ల్యాబ్‌లు పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో ఉపయోగకరంగా లేకపోవడంతో ప్రజలు జిల్లా కేంద్ర, ఏరియా ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. ఆ సమయంలో వారు చెందుతున్న ఆందోళనతో విషం త్వరగా శరీరంలోకి చేరి ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో పరిధిలోని గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖాధికారులు అవగాహన కల్పిస్తే ప్రజల ప్రాణాలకు ఎలాంటి ప్రాణహాని ఉండదనే వాదనలు వినిపిస్తున్నాయి.

మరమ్మతు పనులను సత్వరమే పూర్తిచేయాలి

● కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆదేశం

నందిపేట, జూలై 9: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను వేగవంతం చేసి సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని రాజానగర్ దుబ్బా ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అలాగే మాక్లూర్ మండలంలోని ముల్లంగి, బోంకన్‌పల్లి గ్రామాల్లోని పాఠశాలలను అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వీలుగా చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. పాఠశాలలోని వంట గది, వరండా, అదనపు గదులు, వాటర్ ట్యాంకు, టాయిలెట్స్ తదితర నిర్మాణాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు చాలా చోట్ల పూర్తయినాయని, మిగతా చోట్ల వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ రాజీవ్ ఆదేశించారు. అవసరమైన పనులు మాత్రమే చేపట్టాలని, వాటిలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని సూచించారు. వర్షాకాలం సీజన్ కనుక పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. అన్ని పాఠశాలల్లో మొక్కలు విరివిగా నాటి లక్ష్యాన్ని సాధించాలని కోరారు.



కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న రాజానగర్ కాలనీ వాసులు



ముల్లంగిలో మొక్క నాటుతున్న కలెక్టర్

కలెక్టర్‌కు కాలనీ వాసుల సమస్యల మొర..

నందిపేట మండల కేంద్రంలోని రాజానగర్ దుబ్బా ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేయడానికి వచ్చిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు కాలనీ వాసులు సమస్యలను మొర పెట్టుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. మీరు రావడంతోనే రోడ్లను శుభ్రం చేయించారని, మురికి కాలువలు శుభ్రం చేశారని కాలనీ వాసులు కలెక్టర్‌కు తెలిపారు. దీనికి స్పందించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు కాలనీలో తిరిగారు. ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా? వాటర్ సప్లయ్ కనెక్షన్‌లు ఉన్నాయా? సర్వే బృందాలు వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారా అంటూ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆరా తీశారు. నందిపేటలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి కాలనీలు, మురికి కాలువలు, రోడ్లు శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి నవీన్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నందిపేట, మాక్లూర్ మండలాల ప్రత్యేక అధికారులు జగన్నాథ చారి, ముత్తెన్న, పంచాయతీ రాజ్ ఈఈ బావన్న, జడ్పీ ఇన్‌చార్జి డిప్యూటీ సీఈవో బి శ్రీనివాస్ రావు, తహసీల్దార్ ఆనంద్ కుమార్, విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో కిరణ్ కుమార్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.



క్రీడామైదానం కోసం కేటాయించిన స్థలాన్ని చదును చేసిన దృశ్యం

క్రీడామైదానం కబ్జాకు యత్నం!

● అడ్డుకున్న క్రీడా సంఘాల నాయకులు

సుభాష్‌నగర్, జూలై 9: క్రీడా మైదానంపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. క్రీడామైదానం కోసం కేటాయించిన స్థలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి వ్యాపారులు సన్నద్ధమయ్యారు. రాత్రి ఎవరూ లేని సమయంలో క్రీడా మైదానం కోసం కేటాయించిన స్థలాన్ని చదును చేశారు. ఉదయం క్రీడామైదానం కోసం కేటాయించిన స్థలం చదును చేశారన్న విషయం తెలుసుకున్న పలు క్రీడా సంఘాల నాయకులు, ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు క్రీడామైదానం స్థలానికి వెళ్లి అడ్డుకున్నారు. 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఖలీల్‌వాడి మైదానాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి ఇవ్వడంతో నగరంలో క్రీడా స్థలం లేకపోవడంతో గంగాస్థాన్‌లో ఏడు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. గంగాస్థాన్‌లోని ఒలింపిక్ సంఘం పక్కనగల 106 సర్వే నంబర్‌లో ఏడు ఎకరాల స్థలాన్ని అప్పటి ప్రభుత్వం కేటాయించింది. అప్పటి నుంచి ప్రభుత్వం మైదానం వైపు చూడకపోవడంతో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో కబ్జాదారులు ప్రతీసారి క్రీడామైదానంవైపు చూడసాగారు. దీన్ని ప్రతీసారి ప్రతిఘటిస్తూ వచ్చిన క్రీడాసంఘాలు ఇంకా ఎన్నిరోజులు క్రీడామైదానాన్ని కాపాడాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నూతనంగా వచ్చిన ప్రభుత్వం క్రీడామైదానం నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతున్నారు.



వెల్నెస్ సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

వెల్నెస్ సెంటర్ పరిశీలన

● వసతులపై ఆరాతీసిన మున్సిపల్ కమిషనర్

సుభాష్‌నగర్, జూలై 9: వెల్నెస్ సెంటర్‌ను నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న వెల్నెస్ సెంటర్‌ను మంగళవారం పరిశీలించారు. అనంతరం సిబ్బందికి కల్పిస్తున్న వసతులపై అడిగి తెలుసుకున్నారు. జూలై 3న 'ఆంధ్రజ్యోతి'లో వెల్నెస్ సెంటర్‌లో వసతులలేమి కథనంతో ప్రచురణకు స్పందించిన కలెక్టర్.. మున్సిపల్ కమిషనర్‌ను వసతులపై పరిశీలించాలని కోరారు. అంతేకాకుండా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కూడా కలెక్టర్‌ను కలవడంతో మంగళవారం వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించి వెల్నెస్ సెంటర్‌కు కా వాల్సిన వసతులపై సిబ్బందితో చర్చించారు. ప్రస్తుతం ఉన్న భవనం వెల్నెస్ సెంటర్‌కు సరిపోకపోవడం లేదని సిబ్బంది చెప్పడంతో రెండు మూడు రోజుల్లో అదనపు వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు. బాత్‌రూమ్‌ల పరిస్థితిని చూసి వాటి సమస్యను కూడా పరిష్కరిస్తామని తెలిపారు. కమిషనర్‌తో పాటు పెన్షనర్ల సంఘం నాయకులు రామ్మోహన్‌రావు, ప్రసాద్‌రావు, రాధాకిషన్, భోజారావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకపౌర్ణమి సందర్భంగా అరుణాచలంకు ప్రత్యేక బస్సులు

సుభాష్‌నగర్, జూలై 9: కార్తీకపౌర్ణమి సందర్భంగా అరుణాచలంకు ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు నిజామాబాద్ ప్రాంతీయ అధికారి కె.జానిరెడ్డి తెలిపారు. జూలై 21న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సును డిపో-2 నుంచి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 19వ తేదీన రాత్రి 8గంటలకు నిజామాబాద్ నుంచి బయలుదేరి 20వ తేదీన ఉదయం 10గంటలకు కానిపాక విఘ్నేశ్వర దర్శనార్థం చేరుకుంటుందన్నారు. అనంతరం సాయంత్రం 5గంటలకు వేలూరు గోల్డెన్ టెంపుల్ నుంచి అరుణాచలంకు చేరుకుంటుందన్నారు. రాత్రి గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత 21న సాయంత్రం 5గంటలకు అరుణాచలం నుంచి బయలుదేరి 22వ తేదీన ఉదయం 4గంటలకు జోగులాంబ ఆలయానికి చేరుకుంటుందన్నారు. దర్శనం అనంతరం ఉదయం 9గంటలకు జోగులాం బ ఆలయం నుంచి బయలుదేరి సాయంత్రం 6గంటలకు తిరిగి నిజామాబాద్‌కు చేరుకుంటుందన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ.4,200, పిల్లలకు రూ.3,400 ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాల ప్రయాణికులు అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బస్సు రిజర్వేషన్ కౌంటర్ లేదా ఆన్‌లైన్ ద్వారా టికెట్ బుక్ చేసుకునే సౌకర్యం ఉందని తెలిపారు.

ఎస్సారెస్పీలోకి 3275 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మెండోర, జూలై 9: శ్రీరాంసాగర్‌ప్రాజెక్టులోకి ఎగువకు ఉన్న మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 3275క్యూసెక్కుల నీరు వస్తుందని ప్రా జెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80టీఎంసీ) కాగా మంగళవారం సాయంత్రానికి 1061.70 అడుగుల (12.208టీఎంసీ) నీటి నిల్వ ఉందని, గత సంవత్సరం ఇదే రోజు 1066.60అడుగుల (16.824టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని, జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి ఆరు టీఎంసీల నీరు వచ్చి చేరిందని ఈఈ తెలిపారు.

పీజీ సెమిస్టర్ పరీక్షల ఫీజు తేదీ ప్రకటన

డిచ్‌పల్లి, జూలై 9: విశ్వవిద్యాలయం పరిధిలో 2020-21 విద్యా సంవత్సరం పీజీ, ఎంబీఏ, ఎంసీఏ 2వ సెమిస్టర్, ఐఎంబీఏ 8వ సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షల తేదీని మంగళవారం అధికారులు విడుదల చేశారు. విద్యార్థులు జూలై 1లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని రూ.100 అపరాధ రుసుముతో జూలై 19 వరకు చెల్లించవచ్చునని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎంఈడీ పరీక్షలకు 10మంది విద్యార్థుల గైర్హాజరు

డిచ్‌పల్లి, జూలై 9: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ 1వ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ముగిశాయి. గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో జరిగిన పరీక్షకు 35మంది విద్యార్థులకు గాను 28మంది హాజరయ్యారని, 7గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం డిగ్రీ రెండు విడతల్లో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 255మంది విద్యార్థులకు గాను 245మంది విద్యార్థులు హాజరయ్యారని 10మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి'

డిచ్‌పల్లి, జూలై 9: తెలంగాణ విశ్వవిద్యాలయంలో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరికి వినతి పత్రం అందజేశారు. సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 15నుంచి ప్రారంభిస్తున్నారని, ఇదే నెలలో డీఎస్సీ పరీక్షలు ఉన్నాయని యూనివర్సిటీలో చాలా మంది విద్యార్థులు డీఎస్సీ పరీక్షలకు సిద్ధం అవుతున్నారని వారు తెలిపారు. ఎలాగైనా వర్సిటీ పరీక్షలను వాయిదా వేయాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు శ్రీనునాయక్ మంగళవారం రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ.. డీఎస్సీ పరీక్షలు ఉన్న నేపథ్యంలో వర్సిటీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మహేశ్, హరిత, సౌందర్య రమ్య పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న కార్మికులు

'బకాయి వేతనాలు చెల్లించాలి'

ఎడపల్లి, జూలై9: తమకు రావాల్సిన బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు మంగళవారం ఎడపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, గత ఐదునెలలుగా గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికు ల బకాయివేతనాలు వెంటనేచెల్లించి, వారిని పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించి ప్రభుత్వం ద్వారా జీతాలు ఇవ్వాలని, పంచాయితీ కార్మికులను పర్మినెంట్ చేస్తున్నట్లు ఆదేశాలు ఇవ్వాలని వారు డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో పంచాయతీ కార్మికులందరూ సమస్య పరిష్కారం అయ్యేవరకు హైదరాబాదులోనే ఉంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షురాలు పద్మ, కారోబార్ల సంఘం అధ్యక్షులు రాజు, పండరీ, అఫ్రోజ్ ఉన్నారు.

'ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి'

బోధన్ రూరల్, జూలై9: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలలో దివ్యాంగులకు ఇచ్చినమాట నిలబెట్టుకోవాలని దివ్యాంగుల హక్కుల జాతీయ ఐక్యవేదిక గౌరవ అధ్యక్షులు ఏశాల గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం సాలూర మండలంలోని హున్స గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు 6వేల పింఛన్ ఇస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో 5శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. డబుల్ బెడ్ రూమ్‌లలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గైని రాములు, సాలూర మండల అధ్యక్షులు షేక్.నజీర్, సాలూర మండల కార్యదర్శి సింగడి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు సిరిగిరి దేవదాస్, హున్స గ్రామ అధ్యక్షులు బాలేరావు, సాయిలు, కార్యదర్శి జగదీష్, కోశాధికారి లలిత, తదితరులు పాల్గొన్నారు.

మెండోరలో ఘనంగా బోనాల జాతర

మెండోర, జూలై9: మండలకేంద్రంలో అరే కటికె సూర్యవంశం సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు బోనాల జాతర పండగను ఘనంగా నిర్వహించారు. మంగళవారం మెండోర మండల ఆరె కటికె సంఘ సభ్యులు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మండల ఆరె కటికె కులస్తులు మండల కేంద్రంలో పోచమ్మతల్లికి గ్రామం నుంచి మంగళహారతులతో ఊరేగింపుగా మహిళలు బోనాలుఎత్తుకొని డప్పులతో శివసత్తులు పునకాలతో ఊరేగింగా పోచమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద ఆరెకటికె కుల సంఘ సభ్యులు తమ పిల్లపాపలతో వనభోజనాలు చేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఆరె కటికె సంఘ సభ్యులు లింబాజీ, గణేష్, కిషన్, రమేష్, విఠల్, అశవర్, శంకర్, రాము, చందు, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న అరెకెటికె కులస్థులు

గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టండి

● ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దబజార్, జూలై9: నగరంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి ప్రధానరోడ్లు గుంతలుగా మారి నగర ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గుంతలు పడిన రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారులతో ఆయన సమీక్షనిర్వహించారు. రోడ్డు మరమ్మతులు పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలో గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. టీయూఎఫ్ఐడీఎస్ ఫండ్‌లో మిగిలిన పనులు కూడా వెంటనే పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎక్కడైనా కొత్త రోడ్లు వేసినప్పుడు మంచి క్వాలిటీతో వేయాలని లేదంటే ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు. బ్రిడ్జి పనులు శరవేగంగా పూర్తి చేయాలని అలాగే అర్సపల్లి ఆర్‌వోబి బ్రిడ్జిని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ గజవాడ హన్మంత్‌రావు, ఏఈ మురళి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్, ఏఈలు సాయికుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి, జూలై9: పొతంగల్ మండలంలోని తిర్మలాపూర్ గ్రామ సమీపంలో సోమవారం అర్ధరాత్రి తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. హంగర్గ మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తిర్మలాపూర్ సమీపంలో మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. మూడు ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆర్టీఓతోపాటు మైనింగ్‌కు సిఫారసు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

● ముప్కాల్‌లో ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ముప్కాల్: అనుమతి లేకుండా రాత్రివేళలో అక్రమంగా తరలిస్తున్న ఇసుకట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు ఎస్సై బాస్కరచారి తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీకాంత్ ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఇసుక తరలిస్తున్న నిందితుడిపై ఎస్సై కేసు నమోదు చేసి రూ.5వేల జరిమానా విధించినట్టు తహసీల్దార్ పేర్కొన్నారు.

జీవో 10ని రద్దు చేయాలి: సీఐటీయూ

పెద్దబజార్, జూలై9: జీవో 10ని రద్దుచేసి సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లాకార్యదర్శి నూర్జహాన్ అన్నారు. మంగళవారం నగరంలోని ధర్నాచౌక్ వద్ద దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను 65 ఏళ్లు పూర్తయిన వారికి అతితక్కువ రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తూ ఇంటికి పంపుతూ ఇచ్చిన జీవో 10ని రద్దు చేయాలన్నారు. యూనియన్ జిల్లా కోశాధికారి చంద్రకళ మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలతోపాటు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్‌ను పెంచాలని 2023 సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 4 వరకు రాష్ట్రంలో 24 రోజులు నిరవధిక సమ్మె చేయడం జరిగిందన్నారు. అనంతరం అంగన్‌వాడీ దీక్షలకు రిటైర్డ్‌మెంట్ ఉద్యోగుల కార్యదర్శి రామ్మోహన్‌రావు సంఘీభావం తెలిపారు. ఇందులో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

కోటగిరి, జూలై9: పొతంగల్ మండలంలోని జల్లాపల్లి గ్రామానికి చెందిన ఐశ్వర్య (11) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. సోమవారం తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్న ఐశ్వర్యను చికిత్స నిమిత్తం బోధన్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో జిల్లాఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

రుద్రూరు, జూలై9: అనారోగ్య సమస్యలతో ఉరి వేసుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రూరులోని చిక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల రేణుక (48). గత ఐదేళ్లుగా తలభాగంలో నరాల బలహీనత వ్యాధితో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నా తగ్గలేదు. దీంతో ఆమె తీవ్రమైన తలనొప్పి భరించలేక మనస్థాపం చెంది తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు చెందింది. భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

బోధన్‌రూరల్, జూలై9: పట్టణంలోని మహాలక్ష్మి ఆలయంలో మంగళవారం ప్రత్యేకపూజలు చేశారు. నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాల ఊరేగింపుగా మహాలక్ష్మి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సకాలంలో కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కుల సంఘ నాయకులు అశోక్, భూంపల్లి సత్యనారాయణ, ఇందూరు కృష్ణ, శ్రావణ్, రాములు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

ఎడపల్లి, జూలై9: మండలంలోని ఎడపల్లి నుంచి ఎరాజ్‌పల్లి వెళ్లే దారిలోని వృద్ధాశ్రమం సమీపంలో పంటపొలంలో ఉన్న టాన్స్‌పార్మర్‌ను సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. అందులో ఉన్న రాగి వైరును ఎత్తుకెళ్లారని రైతులు తెలిపారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో టాన్స్‌పార్మర్‌ను ధ్వంసం చేసినట్లు చెప్పారు. కొందరు కావాలనే టాన్స్‌పార్మర్‌ను ధ్వంసం చేస్తూ అందులోని రాగివైరును ఎత్తుకెళ్లి పంట పొలాలకు నష్టం కలుగ జేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు వెంటనే స్పందించి విద్యుత్ నియంత్రికలు ధ్వంసం కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్



ఈరవత్రి అనిల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఛైర్మన్లను కలిసిన కాంగ్రెస్ నాయకులు

కమ్మర్‌పల్లి, జూలై 9: రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఈరవత్రి అనిల్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సుంకెట అన్వేష్‌రెడ్డిలను మంగళవారం కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఛైర్మన్లను కలిసినవారిలో కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్‌అధ్యక్షుడు సుంకెట రవి, జిల్లా మైనారిటీ నాయకుడు అబ్దుల్‌రఫీ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, ఉప్లూర్ మాజీ సర్పంచ్ బద్దం రమేష్‌రెడ్డి, దేవాయి రాజేశ్వర్ ఉన్నారు.

టీయూ బాయ్స్ హాస్టల్‌లో యువతికి వసతి

● విద్యార్థిని సస్పెండ్ చేసిన రిజిస్ట్రార్ ● ఆలస్యంగా వెలుగులోకి..

డిచ్‌పల్లి, జూలై9: తెలంగాణ యూనివర్సిటీలోని బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థి తనకు పరిచయం ఉన్న ఓ యువతికి వసతి కల్పించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకిచూసింది. యూనివర్సిటీలో రెండో సంవత్సరం అభ్యసిస్తున్న ఓ విద్యార్థి న్యూబాయ్స్ హాస్టల్ ఉంటున్నాడు. అయిలే గతంలో డిగ్రీ చదివే సమయంలో తనకు పరిచయం ఉన్న ఓ స్నేహితురాలు నిజామాబాద్‌కు రావడంతో ఆమెను నేరుగా తానుఉంటున్న వర్సిటీలోని బాలుర హాస్టల్‌కు తీసుకొచ్చి ఉంచినట్లు తెలుసింది. ఈ విషయం తోటి విద్యార్థులు గమనించి హాస్టల్ చీఫ్ వార్డెన్‌కు సమాచారం ఇవ్వగా ఈ ఘటనపై రిజిస్ట్రార్ యాదగిరి విచారణ చేపట్టడంతో అసలు విషయం బయటపడింది. బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థి గత 15 రోజుల కిందట యువతిని గదిలోకి తీసుకొచ్చి వసతి కల్పించినట్లు తేలడంతో సదరు బాలుడిని యూనివర్సిటీ హాస్టల్ నుంచి, వర్సిటీ నుంచి సస్పెండ్ చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. బాలురహాస్టల్‌లోకి యువతిని తీసుకొచ్చినప్పుడు సెక్యూరిటీ నిర్లక్ష్యంగా వ్యహరించారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నారు. హాస్టల్ వార్డెన్, సిబ్బందినిర్లక్ష్యంతోనే ఇలాంటి సంఘనలు చోటు చేసుకుంటున్నాయని విద్యార్థి సంఘల నాయకులు ఆరోపిస్తున్నారు.

చింతలూర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

● ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన వీడీసీ సభ్యులు

జక్రాన్‌పల్లి, జూలై9: మండలంలోని చింతలూర్ గ్రామంలోని నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి వీడీసీ సభ్యులు కలిశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని కొలిప్యాక్ సింగిల్ విండో ఛైర్మన్ నాగుల శ్రీనివాస్, వీడీసీ సభ్యులు కలిసి సన్మానించారు. గ్రామంలోని కొండపైఉన్న ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని, నిజామాబాద్ నుంచి చింతలూర్ మీదుగా భీమ్‌గల్‌వరకు ఆర్టీసీ బస్సును నడిపించాలని, గ్రామానికి వచ్చే చెరువు వచ్చే కాలువ తూంలను నిర్మించాలని ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. దీంతో సమస్యలను విడతల వారీగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కొలిప్యాక్ సింగిల్‌విండో ఛైర్మన్ నాగుల శ్రీనివాస్, చింతలూర్ వీఈసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయంలో

12న వాహనాలకు వేలం

బోధన్‌రూరల్, జూలై 9: బోధన్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదిన నాలుగు ద్విచక్ర వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు బోధన్ ఎక్సైజ్ సీఐ పవన్ గౌడ్ తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ఉదయం 9గంటలకు కార్యాలయానికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్వస్థలాలకు గొర్రెల కాపరుల పయనం



గొర్రెల మందను తీసుకెలుతున్న యజమానులు

పెద్ద కొడప్‌గల్, జూలై9: వానకాలం ప్రారంభం అయి చిన్నపాటి వర్షాలు కురుస్తుండటంతో జుక్కల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల గ్రామాల్లో గల గొర్రెల యజమానులు తమ స్వస్థలాలకు బయలు దేరారు. తెలంగాణకు పక్కనే ఉన్న మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన గొర్రెల యజమానులు వేసవి కాలంలో అక్కడ నీటి కొరత,మేత కొరత ఉండటంతో ప్రతి సంవత్సరం వేసవి కాలం ప్రారంభంలోనే జుక్కల్ నియోజక వర్గంలోని వివిధ మండలాలలోని గ్రామాలకు గొర్రెలతో సహా వలస వస్తారు. వేసవి కాలం ఈ ప్రాంతంలోనే ఉండి తమ గ్రామాలలో వర్షాలు కురియగానే గొర్రెలతో సహా తిరిగి వెల్తారు. ప్రతీ సంవత్సరం మాదిరగానే ఈ సారి కడ మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన గొర్రెల యజమానులు జుక్కల్, బాన్స్‌వాడ నియోజక వర్గాలకు వలస వచ్చారు. ప్రస్తుతం వారి స్వస్థలాలలో వానలు కురియడంతో జుక్కల్, బాన్స్‌వాడ నియోజక వర్గాలలో ఉన్న గొర్రెల యజమానులు, కాపరులు తవ స్వంత స్థలాలకు పయనం అవుతున్నారు.

కళకళలాడుతున్న ఆరుతడిపంటలు



పెద్ద కొడప్‌గల్‌లో కళకళలాడుతున్న సోయా పంట

పెద్ద కొడప్‌గల్, జూలై 9: పెద్ద కొడప్‌గల్, జుక్కల్ మండలాలలో ఖరీఫ్ సీజన్ కింద రైతన్నలు ఆరుతడి పంటలు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. ఆరుతడి పంటలలో భాగంగా సోయా, పత్తి, మొక్కజొన్న, పెసర, మినుము లాంటి పంటలను సాగు చేస్తారు. గత 20 రోజుల కిందట కురిసిన వర్షాలకు ఆరుతడి పంటలను సాగు చేశారు. ప్రస్తుతం జుక్కల్, పెద్దకొడప్‌గల్ మండలాల్లో గత వారం రోజుల నుంచి చిన్నపాటి వర్షాలు కురియడంతో ఆరుతడి పంటలు ఎక్కడ చూసిన కళకళలాడుతున్నాయి. రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.సోయా, పత్తిలాంటి సాగు చేసిన పంటలు కలుపురా వడంతో రైతన్నలు కలుపునివారణ కోసం పురుగు మందులను పిచికారి చేసే పనుల లో బిజీగా మారారు.అయితే వరిపంట సాగుకోసం అవసరమైన వర్షాలు కురియకపోవడంతో వరిసాగుచేసే రైతన్నలు వర్షాల కోసంఎదురు చూస్తున్నారు.

ఇంటింటికి మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

పెద్ద కొడప్‌గల్, జూలై 9: జుక్కల్ మండలంలోని ఖండెబల్లూర్ గ్రామంలో మంగళవారం జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ హోంస్టీడ్ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాలలో ఉన్న ప్రజలు ప్రతీ ఇంటికి తప్పని సరిగా మొక్కలు పెంచుకోవాలని సూచించారు. మొక్కలు పెంచడం వలన వాతావరణం బాగు పడటంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం అందుతుందని తెలిపారు.

ఏటీఎం మిషన్‌నే ఎత్తుకెళ్లిన దొంగలు



వాహనంలోకి ఏటీఎంను ఎక్కిస్తుండగా సీసీకెమెరాలో రికార్డు అయిన దృశ్యాలు

బిచ్కుంద,జూలై 9:ఎక్కడైనా ఏటీఎంమిషన్‌ను ధ్వంసం చేసి అందులోని నగదును దొంగలు ఎత్తికెళ్లిన సంఘటనలు తరచూ కనిపిస్తాయి.కాని బిచ్కుందలో మాత్రం దొంగలముఠా ఏకంగా ఏటీఎం మిషన్‌నే ఎత్తుకెళ్లడం చర్చనీయాంశంగా మారింది.బిచ్కుంద మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్దగల ఏటీఎం మిషన్‌బాక్స్‌ను మంగళవారం తెల్లవారుజామున దొంగలు ఎత్తుకెళ్లారు. ఏటీఎం బాక్స్‌ను ఆయుధపరికరాలతో పెకిలించే బిగించబడిన వాటిని తొలగించి తాళ్లతో ఏటీఎం మిషన్‌ను దొంగలు తెచ్చుకున్న వాహనంలోకి ఎక్కించుకుని పారిపోయారు.ఏటీఎంను ధ్వంసం చేసిన దృశ్యాన్ని చూసిన కొందరు బ్యాంక్, పోలీసుఅధికారులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఏటీఎం రూమ్‌లో బిగించిన సీసీ కెమెరాలో దొంగతనం దృష్యాలు రికార్డులను పోలీసులు పరిశీలించారు.ఈ విషయం తెలుసుకున్న బాన్సువాడ డీఎస్పీ,బిచ్కుంద సీఐ సంఘటన స్థలానికి చేరుకుని పోలీసుసిబ్బందితో రెండుటీంలను ఏర్పా టుచేసి మహారాష్ట్రలోని ముఖేడ్,హనేగావ్, కర్ణాటక ఔరాద్‌వైపు గాలింపు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. ఏటీఎం మిషన్‌లో 3.90లక్షల నగదు ఉన్నాయని బ్యాంక్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకుని దొంగలకోసం గాలింపు చేపడుతున్నట్లు ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు.

● ఏటీఎం చోరీకి ఉపయోగించిన వాహనం

పెద్ద కొడప్‌గల్: బిచ్కుంద మండల కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున ఏటిఎం దొంగతనానికి పాల్పడిన క్వాలీస్ వాహనాన్ని దుండగులు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో వదిలి వెల్లారు. ఏటిఎం దొంగతనం జరిగిన విషయంసీరియస్‌గా తీసుకున్న పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టడంతో ఏటిఎం దొంగతనానికి ఉపయోగించిన వాహనం జుక్కల్ మండలం పెద్ద గుల్లా తండా దాటిన తర్వాత మహారాష్ట్ర సరిహద్దులో పోలీసులు కనుగొన్నారు. ఏటీఎం దొంగతనం చేసిన దుండగులు జుక్కల్ మండలంలోని పెద్ద ఏడ్గి గ్రామం మీదుగా మహారాష్ట్రకు పారిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

పెద్ద ఏడ్గిలో రెండు ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్లిన దుండగులు

ఏటిఎం దొంగతనానికి పాల్పడిన దుండగులు పెద్ద ఏడ్గి గ్రామంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన సుంకర్‌వార్ హన్మండ్లు, నీలకంఠ్‌రావ్‌లు తమ ఇంటి ముందర ద్విచక్ర వాహనాలు పార్కుచేయగా తెల్లవారు జామున వచ్చిన ఏటీఎం చోరీ చేసిన దుండ గులు రెండు ద్విచక్ర వాహనాలు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ఏటీఎం చోరికి ఉపయోగించిన క్వాలీస్ వాహనాన్ని దుండ గులు మహారాష్ట్ర సరిహద్దులో వదిలి దొంగతనం చేసిన బైక్‌లపై పారిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.



మహారాష్ట్ర సరిహద్దులో వదిలిన వాహనం

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



మృతుడు పోశెట్టి

రుద్రూరు, జూలై 9: పురుగుల మందు సేవించి చికిత్స పొందు తూ వృద్ధుడు మృతి చెందిన సంఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం..రుద్రూరు మండలం లోని రాయకూర్ గ్రామానికి చెందిన కాంతపు పోశెట్టి (60) వృద్ధుడు గత కొంతకాలంగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నాడు. అనారోగ్య సమస్యలను తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం 9గంటల సమయంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగి అది గమనించిన కుమారుడు శంకర్ వెంటనే పోశెట్టిని 108 అంబులెన్స్‌లో బోధన్ ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరిగి అక్కడి నుంచి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మంగళవారం కుమా రుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మాజీలకు సన్మానం

బీర్కూర్, జూలై 9: బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం తాజా మాజీలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇటీవల పదవి కాలం పూర్తి చేసు కున్న తాజా మాజీ, ఎంపీపీ రఘు, స్థానిక ఎంపీటీసీ సావిత్రిలకు పూల మాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారు చేసిన సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్పారావు, సాయిబాబా, హన్మంత్‌రావు, మురళి, నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

బోధన్‌రూరల్, జూలై9: బోధన్ పట్టణంలోని మధుమలాంచ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రముఖ్ తలాండే ఈశ్వర్‌కుమార్ 76వ ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్తదానం మహ దానం అని, రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందన్నారు. 1949జులై 9న కేవలం 25మంది విద్యార్థులతో ఢిల్లీ యూనివర్సిటీలో ప్రారంభమైన ఏబీవీపీ నేడు వేలాది మంది విద్యార్థులతో కూడుకుని ఉందన్నారు. విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ సీనియర్ నాయకులు ఈండ్ల సూర్య కుమార్, లక్ష్మణ్ చౌహాన్, ఆదు సింగ్, గంగాసింగ్, అరవింద్, సురేష్, రాజారాం, జగదీష్, రాములు, రాష్ట్ర వనవాసి సెల్ కన్వీనర్ లక్ష్మణ్ చౌహాన్‌లతో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం

కామారెడ్డిటౌన్, జూలై 9: జిల్లాలోని ఆయా ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం, బస్సు డ్రైవర్లకు కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆర్‌టీవో శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈకార్యక్రమానికి కలెక్టర్,ఎస్పీలు హాజరవుతారని తెలిపారు.

ఏసీజీఈకి సన్మానం

కామారెడ్డిరూరల్, జూలై 9:కామారెడ్డి ఉపాధ్యాయసమాఖ్యల ఆధ్వర్యంలో నూతనంగా నియామకమైన ఏసీజీఈ(అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్) బలరాంను మంగళవారం సన్మానించారు.ఈ కార్యక్రమంలో డీఈవో రాజు,సమాఖ్య ఛైర్మన్ యాదయ్య, కోఛైర్మన్ బషీర్, ఆర్గనైజర్ ప్రవీణ్‌కుమార్, రాజకుమార్, శ్రీనివాస్, సెక్టోరియల్ అధికారి వేణుశర్మ,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి మొక్కలను పంపిణీ చేయాలి



మొక్కలను నాటుతున్న డీఆర్‌డీఏ పీడీ చందర్‌నాయక్

గాంధారి, జూలై 9:ప్రతీ గ్రామపంచాయతీ కార్యదర్శి ఇంటింటికి మొక్కలను పంపిణీ చేసి అవి నాటే బాధ్యతను తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ చందర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని గుడిమెట్, మాధవ్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో హరితవనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీవో తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: ప్రతీఒక్కరు విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని భిక్కనూరు వైద్యాధికారిణీ యేమిమా సూచించారు. మంగళవారం భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతో వైద్యసిబ్బంది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

దోమకొండ, జూలై 9: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మంగళవారం బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు తహసీల్దార్ సంజయ్‌రావ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం, రెండు లక్షల రుణ మాఫీ, కౌలురైతులకు ఇచ్చిన హామీలను అందజేయలన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు అనుపాటి నరేందర్‌రెడ్డి, సంతోష్, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు చింతల రాజేష్, పన్యాల రవీందర్‌రెడ్డి, యువమోర్చా మండలాధ్యక్షుడు కంది మనోజ్ కుమార్, కుర్రి శంకర్, కుంచని జగదీష్, కూర అంజలి, ఎస్‌పాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటిని పరిశీలించిన కేంద్ర బృందం

రెంజల్,జూలై9: జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెంజల్ మండల కేంద్రంలోని మిషన్ భగీరథ నీటిని జల్ జీవన్ కేంద్ర బృందం నీటి నమూనాలను సేకరించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నీరు కలుషితం కాకుండా ఉండేందుకు నీటి నమూనాలను సేకరించినట్లు కేంద్ర బృందం సభ్యులు తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ ట్యాంకుల వద్ద నీటి నమూనాలను సేకరించి నీటిని పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ డీఈ మున్నీ నాయక్, ఏఈ గబ్బర్ సింగ్, చంద్రకాంత్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రూ.39లక్షల విలువైన గుట్కా పట్టివేత



జాతీయ రహదారిపై పోలీసులు పట్టుకున్న వాహనం ఇదే..

డిచ్‌పల్లి, జూలై9: డిచ్‌పల్లిలో గల 44వ జాతీయ రహదారి మీదుగా మెంట్రాజ్‌పల్లి వద్ద నాగపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న గుట్కా ప్యాకెట్లతో ఐచర్ వాహనాన్ని మంగళవారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. ఈవాహనంలో రూ. 39లక్షలు విలువ చేసే నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ముగ్గురు నిందితులను, ఐచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దోమల వ్యాప్తి లేకుండా జాగ్రత్తలు పాటించాలి



నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డిటౌన్, జూలై 9: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో దోమల వ్యాప్తి లేకుండా జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియచంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 4,20వ వార్డులో డ్రైడే కార్యక్రమంలో ఆమె పాల్గొని నిల్వ ఉన్న నీటిని వార్డు ప్రజలతో కలిసి పారబోశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటిబయట ఉండే నీటితొట్లలోని నీటిని ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలనితెలిపారు.మున్సిపల్ సిబ్బంది సైతం మురికికాలువలను శుభ్రపరుస్తు,పిచ్చిమొక్కలు లేకుండా చూడాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డు కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ప్రత్యేక అధికారి



మొక్కను నాటుతున్న ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్

నిజాంసాగర్,జూలై 9: నిజాంసాగర్ ఉన్నత పాఠశాలలో స్పెషల్ అధికారి విజయ్ కుమార్ మొక్కలు నాటారు. చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. మొక్కలను ప్రతి ఒక్కరూ సంరక్షించాలన్నారు. చెట్ల వల్ల వాతావరణ కాలుష్యం జరుగకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో యాదగిరి, ఏపీవో శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రాంచందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కను నాటిన డీఈవో రాజు



మొక్కను నాటుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రాజు

కామారెడ్డిరూరల్,జూలై 9:వనమహోత్సవంలో భాగంగా మంగళవారం కామారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని 6వవార్డు పరిధిలో గల పాత రాజంపేట గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు మొక్క నాటారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వాన్ మహోత్సవాన్ని ఒకపండుగలా జరపాలనిసూచించారు.పచ్చదానాన్ని పెంచే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయ్యాలన్నారు, అంతేగాక మొక్కలు పెంచడం పట్ల విశిష్ఠతను పిల్లలకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో,హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఎల్లారెడ్డి, జూలై 9: యువతి అదృశ్యమైన సంఘటన ఎల్లారెడ్డిలో చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన ఆర్వీ తులసి (20) సోమవారం ఉదయం 9 గంటలకు ఎల్లారెడ్డి పట్టణ సమీపంలో ఉన్న ఆదర్శ కళాశాలకు వెళ్లిసాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదర్శ పాఠశాల సిబ్బందికి అడుగగా కళాశాలకు రాలేదని తెలపడంతో తులసి ఆచూకీ కోసం చుట్టూ పక్కల తెలిసిన బంధువులకు సమాచారం అందించిన తెలియకపోవడంతో తులసి తండ్రి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా సీత్లాపండుగ వేడుకలు



సీత్లాపండుగను నిర్వహిస్తున్న గిరిజనులు

రామారెడ్డి, జూలై 9:వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని,ప్రజలందరు క్షేమంగా ఉండాలని గిరిజన బంజారాలు మంగళవారంసీత్లా పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు.మండలంలోని రెడ్డిపేట్ స్కూల్‌తండా, రమణ తండా,అన్నారం తండా,గోకుల్‌తండా,రాజమ్మ తండా,కన్నాపూర్ తండాల్లో ఆనందోత్సవాల మధ్య పండుగను జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గిరిజన తండాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

రాజంపేట, జూలై 9:మండల కేంద్రంలో మంగళవారం రోడ్డు ప్రమాద స్థలాలను తహసీల్దార్ అనిల్‌కుమార్, సీఐసంపత్, ఆర్‌అండ్‌బీ ఏఈ రవితేజలు సందర్శించారు.ఈ సందర్భంగా ప్రయాణికులకు రోడ్డుప్రమాదాలపై అవగాహన కల్పించారు. రోడ్డుప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ సామ్‌రిచర్డ్‌సన్, ఎస్ఐసంపత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



కొక్కొండ రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్లు



కర్రకు బిగించిన విద్యుత్ వైర్లు



వేలాడుతున్న విద్యుత్ వైర్లు

- రక్షణ లేకుండా తక్కువ ఎత్తులో నిర్మాణం
- మూగ జీవాలకు శాపంగా మారిన వైనం
- భయాందోళనలో రైతులు, ప్రజలు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

ఎల్లారెడ్డి, జూలై 9:విద్యుత్ సరఫరా సౌకర్యం కోసం మండలంలోని అన్నిగ్రామాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.కానిపలు గ్రామాల్లో కిందకి ఏర్పాటు చేయడంతో పాటు కంచె ఏర్పాటు చేయకపోవడంతో విద్యుత్ ప్రమాదాలకు ట్రాన్స్‌ఫార్మర్లు నెలవుగా మారాయి. తక్కువ ఎత్తులో ఉండటంతో మూగ జీవాలు వాటికి తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడుతున్నాయి. ముఖ్యంగా మూగ జీవాలకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండటం,వైర్లు కిందకి వేలాడటం లాంటివి శాపంగా మారాయి. ఎల్లారెడ్డి మండలంలోని కొక్కొండ గ్రామానికి వెళ్లే రహదారి పక్కన తక్కువ ఎత్తులో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. రోడ్డుపై ప్రయాణించే ప్రయాణీకులకు మేతకు వెళ్లే మూగ జీవాలకు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల మండలంలో గాలివానబీభత్సాలకు కొన్ని గ్రామాలలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

● కంచె ఏర్పాటు చేయాలి

ప్రతి ఏడాది పదుల సంఖ్యలో మూగ జీవాలు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోతున్నాయి. వేసవి, వర్షాకాలం ప్రారంభంలో మూగ జీవాలు మేత కోసం బయటకు వెళుతున్నక్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడుతున్నాయి. ప్రమాదాలకు నెలవుగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని, అదే విధంగా రైతులు వ్యవసాయ క్షేత్రాల్లోకి వెళుతున్న క్రమంలో గట్ల వెంట రహదారుల పక్కన ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండటంతో ఏప్రమాదం వచ్చిపడుతుందోనని భయాందోళన వ్యక్తంచేస్తున్నారు.ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి తక్కువఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి రక్షణకంచెను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.



తుప్పు పట్టి ప్రమాదకరంగా ఉన్న స్తంభం

ఎత్తులో ఏర్పాటు చేయాలి

తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుగా గద్దెలు నిర్మించి దానిపై ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలి.విద్యుత్ ఘాతం నుంచి మూగ జీవాలను కాపాడుకునేలా, విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్ధరణ పనులు చేపట్టాలి.

\- సాయిలు, రైతు

అన్నదాతకు సమాచార కేంద్రాలుగా రైతు వేదికలు



మద్నూర్ రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

మద్నూర్, జూలై 9: అన్నదాతలకు ఆధునిక వ్యవసాయంపై సలహాలు, సూచనలు వీడియో ద్వారా తెలుసుకోవడానికి ప్రభుత్వం రైతు నేస్తం పేరుతో శిక్షణ, అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఈఏడాది మార్చిలో మొదటి విడతగా రాష్ట్రంలో 110 వంది కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రతీ మంగళవారం ఈ రైతు నేస్తం కార్యక్రమం విత్తనం నుంచి మొదలుకుని పంటల సాగు, ఆధునిక, వ్యవసాయ పద్ధతులు, పంటలకు అందించాల్సిన నీరు, ఎరువులు, యాజమాన్య పద్ధతులు, చీడపురుగుల నివారణ, సేంద్రీయ వ్యవసాయ విధానాలు, యాంత్రీకరణ మొదలు వ్యవసాయ పద్ధతులను రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయాల అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, నిపుణులతో అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఉమ్మడి మద్నూర్ మండలంలో మొదటి విడతలో రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో ఎల్ఈడీ టీవీ, వీడియో కెమెరాలు, స్టాండ్ సౌండ్ సిస్టం తదితర మెటీరియల్స్‌ను బిగించారు. రెండవ విడతలో డోంగ్లీ మండలంలో లింబూర్‌లో రైతు నేస్తం కార్యక్రమానికి రైతు వేదికను సిద్ధం చేయడానికి ప్రభుత్వం ఆదేశించినట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో రెండు మండలాలు ఉండగా మొదట మద్నూర్ మండల కేంద్రానికి ప్రాధాన్యం ఇచ్చారు. రెండవ విడతగా డోంగ్లీ మండలంలోని లింబూరులో ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నారు. గతంలో రెండు మండలాలకు సంబంధించిన మండల కేంద్రంలోనే ఉండటంతో డోంగ్లీ మండలం రైతులకు దూరం కావడంతో డోంగ్లీకి దగ్గరలోని లింబూర్‌లో మరో రైతు నేస్తం కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి మండలానికి ఒక రైతు నేస్తం కేంద్రాన్ని మంజూరు చేసింది. వీటిని రైతు వేదికలో ఏర్పాటు చేసే విధంగా చూస్తున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో 9 రైతు వేదికలు ఉన్నాయి. రాబోయే రోజుల్లో మిగతా రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమాలను ప్రారంభించినట్లయితే రైతులకు అందుబాటులో ఉంటాయని అభిప్రాయ పడుతున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత



చెక్కులను పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే

కామారెడ్డిటౌన్, జూలై 9: కామారెడ్డి నియోజకవర్గం లోని ఆయా మండలా లకు సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారంఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్,దేవునిపల్లి,ఇల్చిపూర్, లింగాపూర్, టెక్రియాల్, పట్టణంలో మొత్తం 69 కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కు లను,మండలంలోని చిన్నమల్లారెడ్డి,కొటాల్‌పల్లి, క్యాసంపల్లి,తిమ్మక్‌పల్లి గ్రామాలల్లో 88 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సి పల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, కౌన్సిలర్‌లు,నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న నాయకులు

కామారెడ్డిటౌన్, జూలై 9: అఖిలభారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) 76వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఏబీవీపీ నాయకులు జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం, సమాజ ఉన్నతి కోసం, సంస్కృతి పరిరక్షణ కోసం ఏబీవీపీ ఆవిర్భవించిందని అన్నారు. ఆవిర్భావం నుంచి విద్యార్థుల సమస్యలపై ఎనలేని పోరాటం చేస్తూ విద్యార్థులకు అండగా నిలుస్తుందని ఏబీవీపీ సేవ కార్యక్రమాలకు ఆకర్షితులవుతున్న ఎందరో విద్యార్థులు సభ్యత్వాన్ని తీసుకుంటున్నారని అన్నారు.అంతకముందు శివాజీవిగ్రహం నుంచి ర్యాలీగా నిజాంసాగర్ చౌరస్తా వరకు అక్కడి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ముగించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఖలీల్,అల్తాఫ్, వెంకటేష్, నవీన్, ప్రత్యూష, మానస,శ్రేయ,వరుణ్,శివ తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద:ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్రకార్యవర్గసభ్యులు ముప్పిడి వెంకట్ మాట్లాడుతూ 76 వసంతాలు పూర్తిచేసుకుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు,సాయిరాం,శ్రీకాంత్,గణేష్,అనురాధ,తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన గంగాధర్

బాన్సువాడ, జూలై 9 : బాన్సువాడ పట్టణంలోని హరిజనవాడ కాలనీకి చెందిన తాళ్ల గంగాధర్ (33) అనే వ్యక్తి పట్టణంలోని మహేశ్వరి థియేటర్ ఎదురుగా గల డ్రైనేజీ కాలువలో పడి మృతి చెంది నట్లు సీఐ కృష్ణ తెలిపారు. గంగాధర్ గత కొన్ని సంవత్సరాలుగా బాన్సువాడ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడని అతని భార్య కొంత కాలంగా విడిచిపెట్టడంతో మనసాపానికి గురై మద్యానికి బానిసై సోమవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళుతున్నాను అని చెప్పి తిరిగి రాకపోవ డంతో చుట్టూ పక్కల వారిని అడుగగా ఆచూకి లభ్యం కాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం మహేశ్వరి థియేటర్ ఎదురుగా డ్రైనేజీ కాలువలో గుర్తు తెలియని మృత దేహం లభించిందని తెలపడంతో మృత దేహాన్ని పరిశీలించగా తాళ్ల గంగాధర్ మృత దేహం లభ్యం కావడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అంకోల్ తండాలో మధ్యాహ్న భోజనం పరిశీలన



చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న ప్రత్యేక అధికారి

నసురుల్లాబాద్,జూలై 9: నసురుల్లాబాద్ మండలంలోని అంకోల్ తం డాలోని అంగన్‌వాడీని మంగళవారం మండల స్పెషల్ అధికారి దయానంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంత రం అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని చే శారు.అనంతరం అంకోల్ తండ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి రికార్డు లను తనిఖీ చేశారు. సంఘం గ్రామ పంచాయితీలో కెనాల్ బండ్ ప్లాంటే షన్‌లో పాల్గొన్నారు. నసురుల్లాబాద్ గ్రామ పంచాయితీలో హోంస్టెడ్ ప్లాంటేషన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈకార్య క్రమంలో ఎంపీవో రాము, ఏపీవో, టీఏలు, గ్రామ పంచాయతీ కార్యద ర్శులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పెద్ద కొడప్‌గల్, జూలై 9: జుక్కల్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అరవింద్ తెలిపారు. 10తరగతి పూర్తయిన విద్యార్థులు తమ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులలో తెలుగు మీడియంలో ఖాళీలు ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

మినీ ట్యాంక్ బండ్ పనుల పరిశీలన



ఉపాధ్యాయుల రిజిష్టర్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, జూలై 9 :ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో ఉన్న పెద్ద చెరువు కట్టపై నిర్మిస్తున్న మినీ ట్యాంక్‌ను మంగళవారం ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పరిశీలించారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లను ఆదేశించారు. మినీ ట్యాంక్ బండ్ చేపడుతున్న పనులు పార్కు, మెట్లు, రైలింగ్, వాక్ వే, పార్కు సంబంధించిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, సీనియర్ నాయకులు గయాజుద్దీన్, ఆరీఫ్, గఫర్, తిరుపతి, కొడుముల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణను పరిశీలించారు. పాఠశాల ఆవరణ ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, అదే విధంగా ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయుల రిజిష్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

● సెల్‌ఫోన్ల స్వాధీనం

బాన్సువాడ, జూలై 9: బాన్సువాడ పట్టణంలోని బీడీ వర్కర్ కాలనీ సమీపంలో పక్క సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం పోలీసులు పేకాట స్థావరంపై మెరుపు దాడి చేసి ఐదుగురిని పట్టుకుని ఐదు ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాట నిర్వహించిన ఆడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మాగి షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్‌గా షాదుల్

నిజాంసాగర్, జూలై 9: నారాయణ ఖేడ్ నియోజకవర్గ పరిధిలోని కంగ్టి మండలం జంమ్గి (బీ) గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి షాదుల్ సాబ్‌ను రాష్ట్ర షుగర్ కేన్ కమీషనర్ మంగళవారం మాగి షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించిన సీడీసీ చైర్మన్ ఎంపిక చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర ఐటీ అండ్ భారీ పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు,నారాయణఖేడ్ ఎమ్మెల్యేడాక్టర్‌పట్లోళ్ల సంజీవ్‌రెడ్డికి, జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్‌కు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దామరంచలో కంటి వైద్య శిబిరం

బీర్కూర్,జూలై 9: మండలం దామరంచ, బీర్కూర్ గ్రామాలలో మంగళవారం బీర్కూర్ లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఉచితకంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈశిబిరంలో 60మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.ఇందులో ముగ్గురికి మోతిబిందు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. బోధన్ లయన్స్ ఆసుపత్రికి తరలించి, వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని లయన్స్ అధ్యక్షుడు గాలయ్య తెలిపారు.ఈకార్యక్రమంలో అధ్యక్షుడు మేకల గాలయ్య, కోశాధికారి డాక్టర్ రమేష్ సితాలే, సీనియర్ లయన్స్ కొత్తూరు సంతోష్‌కుమార్, మన్నెం కిషోర్, పెండ్యాల రమేష్, వైద్య బృం దం పాల్గొన్నారు.

30 ఏళ్ల పైబడిన మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

బీర్కూర్, జూలై 9: 30 ఏళ్లు పైబడిన మహిళలు అందరూ తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించు కోవాలని వైద్యాధికారిణి శ్రీలేఖ అన్నారు. మంగళవారం బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామా ల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు పీహెచ్‌సీకి తరలి వచ్చారు. డాక్టర్ శ్రీలేఖ మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళలకు ఉచితంగా మందులు అందజేశారు. సమస్య తీవ్రంగా ఉన్న వారికి పెద్దఆసుపత్రులకు రిఫర్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైన మద్నూర్ విద్యార్థి

మద్నూర్,జూలై 9 : మద్నూర్ మండల కేంద్రం నుంచి జూనియర్ లెక్చరర్‌గా రాష్ట్రంలో నాల్గవ స్థానం సాధించి ఉద్యోగం సంపాదించాడు. మద్నూర్ మండల కేంద్రానికి చెందిన విశ్వజిత్ కాంబ్లే, జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైన ఆయనకు గ్రామస్తులు అభినందించారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక



విద్యుత్ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నసురుల్లాబాద్, జూలై 9 : తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, డివిజన్ బాన్సువాడ, విద్యుత్ వినియోగ దారుల సమస్యల పరిష్కా వేదిక, కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండల కేంద్రంలో 33/11 కే.వీ. సబ్ స్టేషన్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డిపార్టుమెంట్ అధికారులు, రైతులు ప్రజలకు విద్యుత్ వినియోగంపై ప్రజలకు సూచించారు. ఈ కార్యక్ర మంలో నసురుల్లాబాద్ ఏఈ అరవింద్, ఎస్.రామకృష్ణ, ఎస్ఏఈ ఎల్.కిషన్, మెంబర్ ఫైనాన్స్ ఎం.రాజాగౌడ్, వివిధ మండలాల ట్రాన్స్‌కో ఏఈలు, విద్యుత్ డిపార్టు మెంట్, సిబ్బంది రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రకటించిన ఆర్డీవో

● మున్సిపల్ చైర్మన్ పదవి కోల్పోయిన సత్యనారాయణ

ఎల్లారెడ్డి, జూలై 9: ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణపై కౌన్సిలర్లు గత మే నెల 18న నిర్వహించిన అవిశ్వాసంకు సంబంధించి ఫలితాలను ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవిశ్వాసం నెగినట్లు ప్రకటించారు. అవిశ్వాసం నెగ్గడంతో మున్సిపల్ చైర్మన్ పదవీ కోల్పోయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - ఓసీ
దర్పన్ - కల్కి
ప్రియా 70 - కల్కి
ప్రియా 35 - 14

బాన్సువాడ

మహేశ్వరి - కల్కి
వెంకటేశ్వర్వ - మహారాజ

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

